అమ్మకానికి డీ-పట్టాలు!

- ఒక్కో స్థలానికి రెండు లేదా మూడు పట్టాల తయారు
- రెవెన్యూ అధికారులకే అంతుచిక్కని వైనం
- బీటీపీ లే అవుట్‌లో 'తమ్ముళ్ల' కబ్జా పర్వం

- రాయదుర్గం పట్టణంలోని ఓ వికలాంగురాలికి లే అవుట్‌లో పట్టా ఇచ్చారు. ఆ స్థలంలో వారు నిర్మాణం చేపట్టక వదిలేశారు. దీన్ని అదునుగా తీసుకున్న ఓ వ్యక్తి ఇతరులకు రూ.30 వేలకు అంటగట్టాడు. వారు అందులో పనులు మొదలుపెట్టారు. అసలు పట్టాదారు వచ్చి అడ్డుకుంది. ఇటీవల తహసీల్దార్ కార్యాలయం వద్ద ఈ వివాదం పెద్ద రచ్చలా సాగింది.
- పట్టణంలోని బీటీపీ లేఅవుట్‌లో డీ-పట్టాలు ఇష్టారాజ్యంగా పుట్టుకొచ్చాయి. గతంలో ఈ లే అవుట్‌లోనే టీడీపీ నాయకులు పట్టాలు ఎక్కువగా అమ్ముకున్నారనే అభియోగాలు వ్యక్తమవుతున్నాయి. ఈ లేఅవుట్‌లో సుమారు 150- 200 పట్టాలు అక్రమార్కుల చేతిలోకి వెళ్లిఉంటాయని అధికారులే అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.


బీటీపీ లేఅవుట్‌లో కొనసాగుతున్న నిర్మాణాలు

రాయదుర్గం: ప్రభుత్వ స్థలాలకు ఇష్టారాజ్యంగా డీ-పట్టాలు పుట్టుకొస్తున్నాయి. ఇది రెవెన్యూ అధికారులకే అంతుచిక్కడం లేదు. ఇవి అసలువా..? లేకా బోగస్‌వో అర్థం కాక వారే తలమునకలవుతున్నారు. టీడీపీ హయాంలో తెలుగు తమ్ముళ్లు కొందరు ప్రభుత్వ లే అవుట్లలో ఖాళీ స్థలాలను కబ్జా చేసి, వాటిని రూ.30 వేల నుంచి రూ.40 వేలకు పేదలకు అంటగట్టారనే అభియోగాలు వ్యక్తమవుతున్నాయి. కొనుగోలుదారులకు ఎలాంటి ధ్రువీకరణపత్రం ఇవ్వకుండా ఇదిగో స్థలం..? ఇచ్చేయ్ డబ్బు..? అంటూ వైకుంఠం చూపారు. తీరా చూస్తే ఆ స్థలానికి ముందే పట్టా ఇచ్చారనే పిడుగు లాంటి వార్త ఆలస్యంగా తెలుసుకున్నారు. ఈ తప్పిదాల నుంచి గట్టెంక్కేందు కోసం ఖాళీ జాగా కనిపిస్తే చాలు ఆలోచించకుండా బేస్ మట్టాలు వేస్తున్నారు. వాటికి డీ-పట్టాల పొందేందుకు రెవెన్యూ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. వీరి అవసరాలను ఆసరాగా చేసుకున్న కొందరు దళారులు మృతి చెందిన వాటి, ఇక్కడి నుంచి బదిలీపై వెళ్లిన వారు, పదవీ విరమణ పొందిన తహసీల్దార్ల సంతకాలతో బోగస్ డీ-పట్టాలు తయారు చేసి రూ.5 వేల నుంచి రూ.10 వేల లోపు అమ్ముతున్నట్టు విశ్వసనీయ సమాచారం. ఇవి రెవెన్యూ రికార్డుల్లో ఉండడటం లేదు. ఆ పట్టా పొందిన వారు యధేచ్ఛగా నిర్మాణాలు సాగిస్తున్నారు. ఈ కారణంగా తరచూ ఏదో ఓ చోట వివాదాలు తలెత్తుతున్నాయి.

ఆక్రమణదారుల చేతుల్లో బీటీపీ లేఅవుట్

బీటీపీ లేఅవుటట్ లో ప్రభుత్వ స్థలాలన్నీ ఆక్రమణదారుల చేతిల్లోకి వెళ్లాయి. నిబంధనలకు విరుద్ధంగా ఒక్కొక్కరు 4 -5 సెంట్లకు పైగా బేస్ మట్టాలు ఏర్పాటు చేసుకున్నారు. చాలా మంది గ్రామీణ ప్రాంతాల వారు, సంబంధం లేని వ్యక్తులే ఎక్కువ ఉన్నట్టు అధికారులు, ప్రజాప్రతినిధులు గుర్తించారు. ఇటీవల మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్పతో పాటు కౌన్సిలర్లు లేఅవుట్ ను సందర్శించి ఆక్రమణలను అడ్డుకున్నారు. బోగస్ పట్టాలు సృష్టించి ఇష్టారాజ్యంగా నిర్మాణాలు చేపట్టడం పై వారు అసహనం వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు లేఅవుట్ ప్రకారం విచారణ చేపట్టి అక్రమాలు నిగ్గుతేల్చాలని కౌన్సిలర్లు విజ్ఞప్తిచేశారు. టీడీపీ నాయకులు చేసిన పాపాలు, మోసాలకు పేదలు బలి కావాల్సి వస్తోందన్నారు. ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి దృష్టికి తీసుకెళ్లి పేదలకు న్యాయం చేసేలా కృషి చేస్తామని వారు హామీ ఇచ్చారు. బోగస్ పట్టాలపై విచారణ జరిపించాలని విజ్ఞప్తిచేశారు. కాగా ఓ పోలీస్ అధికారి కూడా అక్రమంగా బేసిమట్టాలు నిర్మించుకున్నారనే అభియోగాలు వ్యక్తమవుతున్నాయి.

ఆక్రమణలను అడ్డుకుంటాం



బీటీపీ లేఅవుట్‌లో అక్రమ నిర్మాణాలు పెరిగినట్టు మా దృష్టికి వచ్చింది. ఈ విషయాన్ని ఆర్డీఓ, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తాం. దీనిపై సమగ్ర విచారణకు ఆదేశిస్తాం. పాత లే అవుట్‌కు విరుద్ధంగా ఏర్పాటైన ప్రతి బేస్ మట్టాన్ని తొలగిస్తాం. వారి వద్దనున్న పట్టాలను స్వాధీనం చేసుకుంటాం. అందులో బోగస్ సంతకాలు ఉన్నట్టు తేలితే బాధ్యులపై చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వ స్థలాలను ఎట్టి పరిస్థితుల్లో ఆక్రమణకు గురికాకుండా కాపాడుతాం.

– ఓబులేసు, ఇన్‌చార్జ్ తహసీల్దారు, రాయదుర్గం

ఘనంగా వన భోజన మహోత్సవం


విప్ స్వగృహం వద్ద మంత్రి పెద్దిరెడ్డి

రాయదుర్గం: డి హీరేహాళ్ మండలం హిర్దేహాళ్ గేట్ సమీపాన ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి వ్యవసాయం క్షేత్రంలో శనివారం కార్తీక వనభోజనోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన గృహంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేపట్టారు. కార్యక్రమానికి పలు గ్రామాలకు చెందిన మహిళలు తరలివచ్చారు. వారితో కలసి విప్ దంపతులు కాపు రామచంద్రారెడ్డి, భారతి, కుమారుడు ప్రవీణ్‌రెడ్డి, కోడలు అలేఖ్యరెడ్డి, కుమార్తె శ్రవంతిరెడ్డి ఉసిరి చెట్టు వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సహపంక్తి భోజనం చేశారు. కాగా కార్యక్రమానికి రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కాపు కుటుంబ సభ్యులతో కలసి మంత్రి సరదాగా గడిపారు. అనంతరం కాపు కుటుంబంతో పాటు ఎంపీ తలారి రంగయ్య, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, పార్టీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, ఏడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ పామిడి వీరాంజనేయులు సహపంక్తి భోజనం చేశారు. అనంతరం మంత్రితో పాటు ప్రముఖులందరినీ సన్మానించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

'ఆడుదాం ఆంధ్రా' విజయవంతం చేద్దాం

కళ్యాణదుర్గం రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని మున్సిపల్ కమిషనర్ వెంకటేశులు, ఎంఈఓ విజయ్‌కుమారి, ఎంపీడీఓ సాలమాన్ సూచించారు. శనివారం కరణం చిక్కప్ప పాఠశాల విద్యార్థులతో కలసి వారు టీ సర్కిల్ వరకూ ర్యాలీ నిర్వహించారు. వానే మాట్లాడుతూ. ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం ఈ నెల 15 నుంచి ప్రారంభమవుతుందన్నారు. ఇప్పటికే క్రీడాకారులు సచివాలయాల్లో రిజిస్టేషన్ చేసుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు, నియోజకవర్గ కోఆర్డినేటర్ చల్లా కిరణ్, మండల కోఆర్డినేటర్ రమేష్, స్టేడియం కోచ్ మద్దలేటి తదితరులు పాల్గొన్నారు.

కూడేరు: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న 'ఆడుదాం ఆంధ్రా' క్రీడా టోర్నీలో క్రికెట్, వాలీబాల్, కబడ్డీ , ఖోఖో ఆటల్లో నియోజక వర్గ స్థాయిలో ప్రథమ విజేతగా నిలిచే జట్టుకు రూ.35 వేలు బహుమతి అందజేస్తామని ఎంపీడీఓ ఎంకే బాషా తెలిపారు. ఆడుదాం ఆంధ్రా రిజిస్ట్రేషన్ల ప్రక్రియపై శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఆయన పీడీలు, పీఈటీలు, వలంటీర్లతో సమీక్షించారు. ద్వితీయ విజేతగా నిలిస్తే రూ.15 వేలు, తృతీయ విజేతగా నిలిస్తే రూ.5వేలు అందజేస్తామన్నారు. జిల్లా స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలకు రూ.60 వేలు, రూ.30 వేలు, రూ.10 వేలు ఉంటుందని ఆయన తెలియజేశారు. అలాగే బ్యాడ్మింటన్ డబుల్స్‌లో నియోజక వర్గ స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలకు రూ.20 వేలు, రూ.10 వేలు, రూ.5 వేలు అందజేస్తామన్నారు. జిల్లాస్థాయిలో రూ.35 వేలు, రూ.20 వేలు, రూ.10 వేలు ఉంటుందన్నారు.

సరికొత్త హంగులతో అంగన్‌వాడీ భవనాలు


మాట్లాడుతున్న ఎస్ఎస్‌ఏ పీఓ వరప్రసాద్

రాయదుర్గం రూరల్: మన బడి నాడు నేడు తరహాలో 'మన అంగన్ వాడీ' నాడు-నేడు ద్వారా ప్రస్తుతం ఉన్న అంగన్ వాడీ భవనాలకు మౌలిక వసతులు కల్పిస్తూ సరికొత్త హంగులతో ఆధునీకరించడానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని ఎస్ఎస్ఏ పీఓ (డిప్యూటీ కలెక్టర్) వరప్రసాద్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో సీడీపీఓ ప్రభావతి అధ్యక్షతన సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలకు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమానికి ఐసీడీఎస్ పీడీ శ్రీదేవితో పాటు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. వారు మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు సురక్షితమైన, స్వచ్ఛమైన వాతావరణాన్ని కల్పిస్తూ ప్రభుత్వం అంగన్ వాడీ భవనాల మరమ్మతులకు శ్రీకారం చుట్టిందన్నారు. రాయదుర్గం ప్రాజెక్టు పరిధిలో 95 భవనాలను ఆధునీకరిస్తామన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు జమా ఖర్చుల రికార్డులు పక్కాగా నిర్వహించాల్సి ఉంటుందని ఎస్ఎస్ఏ ఏపీఓ గురుమునికృష్ణ సూచించారు. కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ వనజాక్షి, వరదరాజులు, సూపర్‌వైజర్లు ఈశ్వరమ్మ, అంజినమ్మ, నాగరత్న , అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే సంక్షేమం, అభివృద్ధి


మాట్లాడుతున్న ఎంపీపీ కరణం పుష్పావతి

విడపనకల్లు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యమని, ఈక్రమంలో ప్రభుత్వం మంచి నమ్మకం కలిగేలా పనిచేయాలని అధికారులకు ఎంపీపీ కరణం పుష్పావతి, జెడ్పీటీసీ హనుమంతు సూచించారు. శనివారం స్థానిక ఎంపీడీఓ సమావేశం భవనంలో ఎంపీపీ కరణం పుష్పావతి అధ్యక్షతన సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. విద్య, వైద్య, వ్యవసాయ, గృహ నిర్మాణ, రెవెన్యూ, విద్యుత్, ఉపాధి తదితర శాఖల పనితీరుపై ఎంపీపీ ఆరా తీశారు. చాలా గ్రామాల్లో సక్రమంగా విద్యుత్ సరఫరా చేయడం లేదని, వ్యవసాయానికి పగటి సమయంలో విద్యుత్ సరఫరా చేసేలా చూడాలని సభ్యులు డిమాండు చేశారు. కొన్ని గ్రామాల్లో సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించడం లేదని సభ్యులు అధికారుల దృష్టికి తెచ్చారు. అధికారులు డిసెంబర్ ఆఖరు వరకూ జీబీసీకి సాగునీరు అందిస్తే రైతులు సాగు చేసిన పంటలు చేతికి వస్తాయని సభ్యులు కోరారు. సభ్యులు విన్నవించిన ప్రతి సమస్యనూ అధికారులు పరిష్కరించాలని ఎంపీపీ ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసులు, ఈఓఆర్డీ సత్యబాబు, వైఎస్ ఎంపీపీ రాకెట్ల పుష్పావతి, సర్పంచులు, ఎంపీటీసీలు, కోఆప్షన్ సభ్యులు, పంచాయితీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

5న కంటి వైద్య శిబిరం

కళ్యాణదుర్గం రూరల్: ధర్మవరం రోటరీ క్లబ్, శంకర్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆర్యవైశ్య సంఘం సహకారంతో ఈ నెల 5న ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఆ సంఘం అధ్యక్షుడు జయం విశ్వనాథ్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ పట్టణంలోని వాసవీ కల్యాణ మండపంలో వైద్య శిబిరం నిర్వహిస్తామన్నారు. నియోజకవర్గ ప్రజలు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

కళ్యాణదుర్గం: మండలంలోని హులికల్లు గ్రామానికి చెందిన నిజవల్లి శివారెడ్డి అనే వ్యక్తి శనివారం క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. పోలీసుల వివరాల మేరకు... తండ్రి తిమ్మప్పతో అతడు కొంతకాలంగా ఆస్తి విషయమై తగువు పడేవాడు. ఈక్రమంలో మనస్తాపంతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు వెంటనే అతడిని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్ళారు. ప్రథమ చికిత్స అనంతరం అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కళ్యాణదుర్గం రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

విధుల్లో నిర్లక్ష్యం.. సిబ్బందికి మెమోలు

శెట్టూరు: విధుల్లో నిర్లక్ష్యం వహించిన సచివాలయ ఉద్యోగులకు మెమోలు జారీ చేసినట్లు తహసీల్దార్ ఫణికుమార్ శనివారం తెలిపారు. మండల కేంద్రంలో పనిచేస్తున్న వెల్ఫేర్ అసిస్టెంట్ మల్లికార్జున, ఇంజినీరింగ్ అసిస్టెంట్ మనోహర్‌కు మెమోలు జారీచేశామన్నారు. బూత్ నంబర్ 154లో ఫారం 6,7,8 దరఖాస్తులు స్వీకరించడంలో వీరు నిర్లక్ష్యం వహించారన్నారు.

శీతల గిడ్డంగి భవనానికి భూమిపూజ

కుందుర్పి: మండలంలోని బండమీదపల్లిలో శనివారం ఏఎఫ్ ఎకాలజీ, రాష్ట్ర ప్రభుత్వ ఏపీ ఎఫ్‌పీసీ పర్యవేక్షణలో శీతల గిడ్డంగి భవనానికి ఆయా సంస్థల అధికారులు భూమి పూజ చేశారు. ఏపీ ఎఫ్‌పీసీ ప్రభుత్వం తరఫున రూ.5.5 కోట్ల నిధులు మంజూరు చేయడం తెలిసిందే. మండల రైతు ఉత్పత్తిదారుల పరస్పర సహకార సంఘం విన్నపం మేరకు ఏఎఫ్ ఎకాలజీ డైరెక్టర్ మల్లారెడ్డి చొరవతో శీతల గిడ్డంగి భవనానికి నిధులు మంజూరయ్యాయని రైతులు తెలిపారు. కార్యక్రమంలో ఏపీ ఎఫ్‌పీసీ డైరెక్టర్లు అజయ్‌కుమార్,వెంకట్ (విజయవాడ), ఎకాలజీ సెంటర్ సీఓ మురళీకృష్ణ, ప్రాజెక్ట్ కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

పిల్లలను సమానంగా పెంచండి

కణేకల్లు: ఆడ, మగ తేడా చూపకుండా పిల్లలను సమానంగా పెంచాలని వైకేపీ ఏపీఎం గోవిందప్ప సూచించారు. కణేకల్లులో శనివారం ×జెండర్ ఆధారిత హింసకు వ్యతిరేకంగా వైకేపీ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం, ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటైన సభలో ఏపీఎం మాట్లాడుతూ కూతురైనా, కుమారుడైనా సమానంగా చూడాలన్నారు. బాల్య వివాహాలు చేయరాదన్నారు. కార్యక్రమంలో సీసీలు పాల్గొన్నారు.

ముళ్ల పొదల తొలగింపు

బెళుగుప్ప: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రహరీలో ముళ్ల పొదలను శనివారం జేసీబీ సాయంతో ఎంఈఓ మల్లారెడ్డి, హెచ్ఎం వెంకటప్రసాద్ తొలగింపజేశారు. ముళ్లపొదల మూలంగా విద్యార్థులు అవస్థలు పడటంతో పాటు రహదారి మీదుగా వాహనాల రాకపోకలకు సమస్యగా ఉండి ప్రమాదాలు చోటుచేసుకునేవి. వైఎస్సార్‌సీపీ మండల బీసీ సెల్ కమిటీ సభ్యుడు పురుషోత్తంరాజు జేసీబీని పంపి సహకరించారని హెచ్ఎం తెలిపారు.

ఓటరు జాబితా పకడ్బందీగా తయారు చేయాలి


జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్

ఉరవకొండ: రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు తప్పులు లేని ఓటరు జాబితాను పకడ్బందీగా చేపట్టాలని జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ ఆదేశించారు. శనివారం తహసీల్దార్ కార్యాలయంలో ఐదు మండలాల తహసీల్దార్లతో జేసీ సమావేశం నిర్వహించారు. అనంతరం జేసీ విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల సంఘం సూచించిన నిబంధనల మేరకు ఓటరు జాబితాను తయారు చేస్తున్నామన్నారు. కొత్త ఓటర్లు ఆయా బీఎల్‌ఓల ద్వారా ఓటు నమోదు చేసుకోవాలన్నారు. ప్రస్తుతం ఉన్న ఓటరు జాబితాలో ప్రతి ఒక్కరూ పేర్లను సరిచూసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉరవకొండ తహసీల్దార్ శ్రీధర్‌మూర్తి, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ మునీంద్ర, ఎన్నికల సీనియర్ సహాయకుడు వంశీకృష్ణ పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం: ఓటరు జాబితా సవరణలో పారదర్శకతకు తావివ్వొద్దని ఇన్‌చార్జ్ ఆర్డీఓ వరప్రసాద్ సూచించారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు శనివారం స్పెషల్ క్యాంపెయిన్ డేను నిర్వహించారు. ఈ సందర్భంగా కళ్యాణదుర్గం పట్టణంలో 56, 57, 58, 59, 69 పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ ఫణికుమార్, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ వెంకటేశులు, డీటీ నాగరాజుతో కలసి ఆర్డీఓ పరిశీలించారు.

రాయదుర్గంటౌన్: ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఇన్‌చార్జ్ ఆర్డీఓ వరప్రసాద్, ఈఆర్ఓ అరుణ కుమారి సూచించారు. శనివారం రాయదుర్గం పట్టణంలోని 184,188 పోలింగ్ కేంద్రాల్లో ఈడీటీ సుజాతో కలసి ఇన్‌చార్జ్ ఆర్డీఓ వరప్రసాద్, కణేకల్లు మండలం సొల్లాపురం గ్రామంలోని పోలింగ్ కేంద్రంలో ఓటరు కార్యక్రమాన్ని ఈఆర్ఓ అరుణకుమారి పరిశీలించి బీఎల్‌ఓలతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. శనివారం ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమంలో నియోజకవర్గంలో 296 పోలింగ్ కేంద్రాల ద్వారా 577 క్లయిమ్‌లు స్వీకరించినట్లు ఈడీటీ సుజాత తెలిపారు.

బొమ్మనహాళ్: మండలంలోని దర్గాహొన్నూరు గ్రామంలో శనివారం పోలింగ్ బూతుల వద్ద ప్రత్యేక ఓటరు నమోదు కేంద్రాన్ని తహశీల్దార్ శ్రీనివాసులు పరిశీలించారు. వీఆర్ఓ రామన్న, బీఎల్‌ఓలు తదితరులు పాల్గొన్నారు

సొమ్మొకరిది.. సోకొకరిది...!

కళ్యాణదుర్గం: సొమ్ము ఒకరిది...సోకొకరిది...అన్న చందంగా వ్యవహరిస్తున్నారు కళ్యాణదుర్గం టీడీపీ నేతలు. వైఎస్సార్‌సీపీ నాయకుడు తన సొంత నిధులతో రోడ్డును బాగు చేస్తుంటే తామే రోడ్డును వేయిస్తున్నామంటూ టీడీపీ నాయకులు గొప్పలు చెప్పుకుంటూ ప్రజలను మభ్య పెడుతున్నారు. ఈ విషయం శనివారం వెలుగులోకి వచ్చింది. వాస్తవానికి కళ్యాణదుర్గం మండలం దురదకుంట గ్రామం వద్ద మానిరేవుకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు సతీష్ రెడ్డి గత కొన్ని రోజుల క్రితం భూమి కొనుగోలు చేశాడు. రోజూ తన వాహనంలో రాకపోకలు సాగిస్తుండటంతో భట్టువానిపల్లి – దురదకుంట గ్రామాల మధ్య రోడ్డుకిరువైపులా కంపచెట్లు, రోడ్డు గుంతలు ఉండటాన్ని గుర్తించి తన సొంత నిధులతో రోడ్డును బాగు చేసేందుకు సిద్ధమయ్యాడు. గత రెండు రోజులుగా జేసీబీతో పని చేయిస్తున్నాడు. అయితే దురదకుంట సర్పంచు అరుణ, ఆమె భర్త సురేష్, నాయకులు జయన్న తదితరులు తామే రోడ్డును బాగు చేస్తున్నామంటూ ప్రజలను మభ్య పెడుతూ పనులు జరిగే ప్రదేశంలో ఫోటోలకు ఫోజులిస్తూ గొప్పలు చెప్పుకుంటున్నారు. అంతటితో ఆగకుండా తాము రోడ్డు పనులు చేస్తుంటే వైఎస్సార్‌సీపీ నాయకులు అడ్డుకుంటున్నారంటూ అసత్య ఆరోపణలు చేస్తూ వైఎస్సార్‌సీపీకి ఆపాదించడం కొసమెరుపు. ఇదంతా గమనించిన స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు ఇదెక్కడి చోద్యం అంటూ ముక్కున వేలేసుకుంటున్నారు.

ఘనంగా గజగౌరి ఉత్సవాలు


గజగౌరి అమ్మవారిని ఊరేగిస్తున్న దృశ్యం

కణేకల్లు: మండల కేంద్రంలో గజగౌరి ఉత్సవాలు శనివారం ఘనంగా నిర్వహించారు. గజగౌరి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించిన బంగారు రథంలో ఉంచి మేళతాళాల నడుమ ఊరేగించారు. మహిళలు హారతులు పట్టుకుని అమ్మవారి రథం ముందు నడిచారు. అనంతరం చిక్కణ్ణేశ్వరస్వామి చెరువులో గజగౌరి అమ్మవారిని నిమజ్జనం చేశారు.

క్లుప్తంగా

సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ


బాధిత కుటుంబానికి చెక్ అందజేస్తున్న విప్

రాయదుర్గం(డి హీరేహాళ్): డి హీరేహాళ్ మండలంలోని నాగలాపురానికి చెందిన తలారి లింగమ్మకు శనివారం ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) కింద మంజూరైన రూ.1.40 లక్షలు విలువ చేసే చెక్కును ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి అందించారు. విప్ మాట్లాడుతూ పేదల జీవితాల్లో సీఎం రిలీఫ్ ఫండ్ వెలుగులు నింపుతోందన్నారు. ఆపద కాలంలో ఈ మొత్తం ఎంతో ఉపయోగ పడుతుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు గన్నీగౌడ, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

పీపుల్స్‌వార్ నాయకుడి సతీమణి మృతి


నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వ

వజ్రకరూరు: మండలంలోని చాబాల గ్రామానికి చెందిన పీపుల్స్‌వార్ రాష్ట్ర నాయకుడు బండయ్య మాస్టారు సతీమణి కె.పక్కీరమ్మ(90)శనివారం తెల్లవారుజామున అనారోగ్యంతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ సమన్వయకర్త వై.విశ్వేశ్వరరెడ్డి చాబాల గ్రామానికి చేరుకుని మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. సర్పంచు మల్లెల జగదీష్, ఎంపీటీసీ పెన్నహోబిలం, మాజీ వైస్ ఎంపీపీలు నారాయణప్ప, శివలింగప్ప, సచివాలయ కన్వీనర్ రామచంద్ర పాల్గొన్నారు.

తక్షణసాయం అందజేత

ఉరవకొండ: స్థానిక 11 వార్డులో నివాసముంటున్న ముల్లాషాను అనే మహిళ ఈ నెల 1న గుండెపోటుతో మృతి చెందింది. దీంతో వైఎస్సార్ బీమా పథకం కింద తక్షణసాయం రూ.10 వేలను నామినీ తాజుద్దీన్‌కు సర్పంచ్ లలితమ్మ అందించారు. కార్యక్రమంలో పార్టీ పంచాయతీ రాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు బసవరాజు, తాజు, వెల్ఫేర్ అసిస్టెంట్ రేఖ, వలంటీర్ భవనేశ్వరి పాల్గొన్నారు.

నిరుపేదలకు దుప్పట్ల పంపిణీ


దుప్పట్లు పంపిణీ చేస్తున్న సత్యనారాయణ

రాయదుర్గంటౌన్: పట్టణంలోని న్యూరోడ్డులో ఉన్న ఎల్ఎస్ స్వీట్స్ (లడ్డూ సూరి) యజమాని రేకులకుంట సత్యనారాయణ, అనిత దంపతుల స్వగృహం వద్ద దాదాపు వెయ్యిమందికిపైగా పేదలకు అన్నదానం నిర్వహించి 500 మందికిపైగా దుప్పట్లను పంపిణీ చేశారు. తమ కుమారుడు సాయి సూర్యగణేష్ నీట్ 2023 పరీక్షల్లో 654 ర్యాంకుతో ప్రతిభ కనుబరచడంతోపాటు తమ తండ్రి రేకులకుంట సూర్యనారాయణశెట్టి జ్ఞాపకార్థం సేవా కార్యక్రమం చేపట్టానని ఆయన తెలిపారు. కార్యక్రమానికి ఆల్ మర్చంట్స్ అసోసియేషన్ సభ్యులు హాజరై దాతలను అభినందించారు.

రేపు సహస్ర లింగార్చన

కుందుర్పి: స్థానిక అల్లాపురం రోడ్డులో ఉన్న బొమ్మరాయ దేవస్థానంలో సోమవారం కార్తీక మాసాన్ని పురస్కరించుకొని సహస్ర లింగార్చన, అభిషేకం, గ్రామోత్సవం తదితర కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ధర్మకర్త సత్యనారాయణశాస్త్రి, సర్పంచ్ మారుతేశ్వని శనివారం తెలిపారు. గ్రామస్తులు ఉత్సవంలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

బాల్య వివాహాలు నిర్మూలిద్దాం


బాలికల సంరక్షణ పోస్టర్లు విడుదల చేస్తున్న అధికారులు

కళ్యాణదుర్గం: బాల్య వివాహాలను అరికట్టడంలో అధికారుల బాధ్యత కీలకమని ఐసీడీఎస్ సీడీపీఓ లక్ష్మీ ప్రసన్న సూచించారు. మండలంలోని నారాయణపురం, బ్యాడ్రహళ్లిలో శనివారం అంగన్‌వాడీ కేంద్రాలు, సచివాలయాలను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా యూనిసెఫ్ రూపొందించిన బాలికల సంరక్షణపై పోస్టర్లను విడుదల చేశారు. అనంతరం సీడీపీఓ మాట్లాడుతూ బాల్య వివాహాలను అరికట్టడంలో అధికారులు కఠినంగా వ్యవహరించాలన్నారు. అనంతరం బాలికలకు బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై వివరించారు. అంగన్‌వాడీ పరిధిలో చిన్నారులు, గర్భిణులకు పౌష్టికాహారం తప్పనిసరిగా అందించాలన్నారు. కార్యక్రమంలో సివిల్ సప్లై డీటీ సుబ్రహ్మణ్యం, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అరుణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

హక్కులపై అవగాహన అవసరం

కణేకల్లు: వినియోగదారుల హక్కుల పరిరక్షణ చట్టంపై అవగాహన కలిగిఉండాలని వినియోగదారుల రక్షణ సంఘం డైరెక్టర్, ఉత్తమ సమాజిక సేవా అవార్డు గ్రహీత చల్లా కిశోర్ సూచించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం వినియోగదారుల హక్కుల పరిరక్షణ చట్టంపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ వస్తువు కొనుగోలు చేసినప్పుడు నాణ్యతతోపాటు తయారీ తేదీ, ఎక్స్‌పైర్ డేట్ చూడాలన్నారు. అలాగే తప్పనిసరిగా బిల్లు తీసుకోవాలన్నారు. ప్రిన్సిపాల్ రమేష్, అధ్యాపకులు పాల్గొన్నారు.

నేడు వనభోజన మహోత్సవం

రాయదుర్గంటౌన్: పట్టణంలోని మొలకాల్మూరోడ్డు చెక్‌పోస్టు వద్ద కుప్పన్న వారి తోటలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆదివారం కార్తీక దామోదర ధాత్రి హోమం, వన భోజనమహోత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు జయంతి సురేష్‌కుమార్ శనివారం తెలిపారు. కార్యక్రమానికి ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, భారతి దంపతులు, ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్, మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప ఇతర ప్రముఖులు హాజరవుతారన్నారు. ఆర్యవైశ్య కుటుంబీకులంతా హాజరుకావాలన్నారు.

ఘనంగా వాల్మీకి జయంతి


వాల్మీకి విగ్రహానికి పూలమాలలు వేస్తున్న దృశ్యం

బ్రహ్మసముద్రం: మండలంలోని పడమటి కోడిపల్లిలో వాల్మీకి జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వాల్మీకి సంఘం నాయకులు, పెద్దలు వాల్మీకి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ వాల్మీకి అడుగుజాడల్లో నడవాలన్నారు.

జేజేఎంతో నీటి సమస్య పరిష్కారం


మాట్లాడుతున్న ఎంపీపీ నారాయణ రెడ్డి

కూడేరు: జల్ జీవన్ మిషన్(జేజేఎం) ద్వారా మండలంలో తాగునీటి సమస్యకు పరిష్కారం చూపుతామని ఎంపీపీ నారాయణ రెడ్డి అన్నారు. జేజేఎం అమలుపై శనివారం ఎంపీపీ చాంబర్‌లో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ నీటి సమస్య ఉన్న గ్రామాలకు తొలి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఇప్పేరు, పి.నాగిరెడ్డిపల్లి, మరుట్ల, ఉదిరిపికొండ తండా, జయపురం, కూడేరు, తిమ్మాపురం, కరుట్లపల్లి గ్రామాల్లో తొలుత బోర్లు వేయించి పనులు ప్రారంభించాలని ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ శ్రీనివాసులుకు సూచించారు. ప్రజల నుంచి తాగునీటి సమస్య ఉందన్న ఫిర్యాదులు రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

రాష్ట్ర కమిటీలోకి చోటు


గ్రంథాలయాధికారి సత్యంబాబు

కంబదూరు: రాష్ట్ర గ్రంథాలయ సంస్థ ఉద్యోగుల సంఘం ప్రాంతీయ అధ్యక్షుడిగా హెచ్. సత్యంబాబు నియమితులయ్యారు. శనివారం విజయవాడలో జరిగిన రాష్ట్రస్థాయి గ్రంథాలయ సంస్థ ఉద్యోగుల సంఘం ఎన్నికలో తనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆయన విలేకరులకు తెలిపారు. తన ఎన్నికకు సహకరించిన రాష్ట్ర అధ్యక్షుడు కల్లేపల్లి మధుసూదనరాజు, ప్రధాన కార్యదర్శి కమ్మన్నకు కృతజ్ఞతలు తెలిపారు.

బొలెరో, ట్రాక్టర్ ఢీ.. ఒకరికి గాయాలు

బొమ్మనహాళ్: మండల కేంద్రం సమీపంలో బళ్లారి-కళ్యాణదుర్గం అంతర్‌రాష్ట్ర రహదారిపై శనివారం సాయంత్రం బొలెరో లగేజీ వాహనం, ట్రాక్టర్ ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల వివరాల మేరకు.. బెళుగుప్ప మండలం బుదవర్తి గ్రామానికి చెందిన తిప్పేస్వామి బొలెరో లగేజీ వాహనంలో బళ్లారి నుంచి స్వగ్రామానికి వస్తుండగా బొమ్మనహాళ్ సమీపంలోని ఇండియన్ పెట్రోల్ బంక్ వద్దకు రాగానే గుర్తు తెలియని ట్రాక్టర్ బలంగా ఢీకొట్టింది. డ్రైవింగ్ చేస్తున్న తిప్పేస్వామి వాహనంలో ఇరుక్కుపోగా.. స్థానికులు బయటికి తీసి, 108లో బళ్లారి విమ్స్‌కు తరలించారు. తిప్పేస్వామి పరిస్థితి విషయమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి విచారణ చేపట్టారు.